# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 296 శనివారం 8 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


- ఇకపై అక్కడి నుంచే సమీక్షలు, సమావేశాలు ..
- అత్యవసర సమీక్షల కోసం సచివాలయానికి..
- కోడ్‌లోనే కేబినేట్ సమావేశానికి నిర్ణయం..
- రేపటి నుండి పెండింగ్‌లో ఉన్న అంశాలపై దృష్టి సారించాలని భావన

# పాలనపై ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇక నుండి రోజు సచివాలయానికి రాన్నున్నారు. గత రెండు నెలలుగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో సచివాలయానికి దూరంగా ఉన్నారు సీఎం రేవంత్. మార్చి 16 నుండి జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో సీఎం పరిపాలనాపరమైన అంశాలకు దూరంగా ఉన్నారు. సమీక్షలు, సమావేశాలు నిర్వహించడానికి, అధికారులను కలవడానికి అనుమతి లేకపోవడంతో సీఎం తన నివాసం జూబ్లీహిల్స్ నుండే కార్యక్రమాలు నిర్వహించారు. ఇక పార్లమెంట్ ఎన్నికల ప్రచారాలను కూడ అక్కడి నుండే నిర్వహించారు సీఎం రేవంత్. అత్యవసర సమావేశాలు, సమీక్షలు ఉంటే కూడా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు తప్ప ఆదేశించడానికి వీలు లేకుండా పోయింది.

3లో



# మోదీ టీంలో చేరిది ఎవరో?



- కేంద్ర మంత్రి పదవి కోసం రాష్ట్ర నాయకుల ఎదురు చూపు
- ప్రధాని నరేంద్రమోదీ తన మంత్రి వర్గంపై ఫోకస్
- మెజార్టీ తగ్గిన నేపథ్యంలో ఈసారి తెలంగాణకు ఛాన్స్ ఇవ్వాలని భావిస్తోన్న కమలం
- తెలంగాణ నుంచి ఇద్దరిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవాలని యోచన





## నీట్ పరీక్షలో అక్రమాలు?

- 67 మందికి ఫస్ట్ ర్యాంకుపై సర్వత్రా అనుమానాలు
- అన్ని సరైన సమాధానాలు రాసిన విద్యార్థికి 720 మార్కులు
- అంతేతప్ప 715కు 720కి మధ్య మార్కులు వచ్చే ఛాన్స్ లేదు
- ఎన్సీఈఆర్టీ పుస్తకంలో మార్పు ప్రకారం ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయి

# ఆరు నెలల్లో ఎంత మార్పో!

- కేవలం ఆరంటే ఆరే నెలల్లో హీరో నుంచి జీరోకి పడిపోయింది బీఆర్ఎస్
- అధికారం నుంచి కోలుకోలేని స్థితికి..
- ఆఖరికి 20 ఏళ్లలో ఏనాడు లేని అత్యంత అవమానకర పరిస్థితిలోకి..
- ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ
- బీ టు బీ ఫ్యాక్ట్.. ఉద్యమం కోసమే పుట్టిన పార్టీ



హైదరాబాద్

ఆరు నెలలు.. కేవలం ఆరంటే ఆరే నెలల్లో హీరో నుంచి జీరోకి పడిపోయింది బీఆర్ఎస్. అధికారం నుంచి కోలుకోలేని స్థితికి.. ఆఖరికి 20 ఏళ్లలో ఏనాడు లేని అత్యంత అవమానకర పరిస్థితిలోకి.. ఇది భారత రాష్ట్ర సమితి పరిస్థితి. లోకసభ ఫలితాల్లో బీఆర్ఎస్ గెలిచిన లోక్‌సభ సీట్ల సంఖ్య సున్నా. భారత రాష్ట్ర సమితి. ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ. టు బీ ఫ్యాక్ట్.. ఉద్యమం కోసమే పుట్టిన పార్టీ. అంతేకాదు ఆరు నెలల క్రితం వరకు అధికార పార్టీ. 88 అసెంబ్లీ సీట్లు, 9 ఎంపీ సీట్లతో రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా ఏకఛత్రాధిపత్యం చేసింది. కట్ చేస్తే.. ఇప్పుడు 39 అసెంబ్లీ స్థానాలతో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక ఈ లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అడ్రస్సే మొత్తానికి గల్లంతైంది. ఇది ఆరు నెలల్లో బీఆర్ఎస్ పార్టీ - మిగతా3లో



## మోదీ వెంటే కలిసి నడుస్తాం

- ఎన్డీఏ పక్ష సమావేశంలో నితీశ్
- "ఏ సందర్భంలోనైనా మేం మీతోనే(మోదీ) ఉంటాం
- ఇండియా కూటమి నేతలు ఈ సారి పొరపాటున గెలిచారు
- దేశం ఇకపై బృహత్తర ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్తుంది.

# నిరూపయోగంగా కాళేశ్వరం ప్రాజెక్టు



- జ్యుడీషియల్ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు..
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్
- ఎన్నికలతో కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ సాధ్యం కాలేదు
- ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 90వేల కోట్లకు అదనంగా వడ్డీ చెల్లిస్తున్నాం
- మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని ఎన్డీఎస్ఏ చెప్పింది

జయశంకర్ భూపాలపల్లి

కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిన్నటి వరకూ పార్లమెంట్ ఎన్నికలతో కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ సాధ్యం కాలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన మరుసటి రోజే కాళేశ్వరం బ్యారేజ్ పనులను పరిశీలించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరూపయోగంగా ఉందని.. ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 90వేల కోట్లకు అదనంగా వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇండియాలోనే అత్యున్నత సంస్థ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (నిపుణుల కమిటీ - మిగతా3లో



## ఈ లోక్‌సభలో చదువురాని ఎంపీలే లేరు

- 80 శాతానికిపైగా గ్రాడ్యుయేట్స్..!
- ఎన్నికల్లో గెలిచిన ఎంపీలంతా విద్యావంతులే
- అసోషియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక
- ఈ ఎన్నికల కోసం మొత్తం 121 మంది నిరక్షరాస్యులు నామినేషన్‌లు దాఖలు చేయగా.. వారిలో ఒక్కరూ కూడా ఎంపీగా విజయం సాధించలేకపోయారని వెల్లడి

# నీట్ పరీక్షలో అక్రమాలు?




నీట్ యూజీ 2024 పరీక్షలో 67 మంది విద్యార్థులు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరీక్షలో మొత్తం 180 పశ్నలు ఉంటాయి. ఒక్కో సరైన సమాధానానికి 4 మార్కులు వస్తాయి. అన్ని సరైన సమాధానాలు రాసిన విద్యార్థికి 720 మార్కులు, కేవలం ఒకే తప్పు సమాధానం రాసిన విద్యార్థికి 715 మార్కులు రావాలి. అంతేతప్ప 715కు 720కి మధ్య మార్కులు వచ్చే ఛాన్స్ లేదు. కానీ కొందరు విద్యార్థులకు 718, 719 మార్కులు కూడా రావడంతో పరీక్షల్లో అక్రమాలు జరిగాయేమోనన్న అనుమానాలకు బలం చేకూరుతోంది.

దాంతో నీట్ పరీక్ష పేపర్ లీకయ్యిందని కొందరు, భారీ స్కామ్ జరిగిదని ఇంకొందరు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివాదంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ స్పందించింది. ప్రశ్నలు సులువుగా ఉండటం, రిజిస్ట్రేషన్‌లు పెరగడం, ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉండటం, కొందరికి పరీక్ష సమయం తగ్గడంతో గ్రేస్ మార్కులు ఇవ్వడం లాంటివి పరీక్షలు కొందరు ఎక్కువ మార్కులు సాధించడానికి కారణమైందని ఎన్టీఏ పేర్కొంది. ఎన్సీఈఆర్టీ పుస్తకంలో మార్పు ప్రకారం ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, ఆ ప్రశ్నకు ఇచ్చిన రెండు ఆప్షన్లను ఎన్సీఈఆర్టీ తమ పాత, కొత్త పుస్తకాల్లో సరైనవిగా గుర్తించిందని, దాంతో రెండు ఆప్షన్‌లను సరైనవిగా ప్రకటించామని, దాంతో 44 మంది అభ్యర్థుల మార్కులు 715 నుంచి 720కి పెరిగాయని ఎన్టీఏ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ నీట్ పరీక్షలో రికార్డు స్థాయిలో టాపర్లు నమోదవ్వడం, రూల్స్? ప్రకారం ఇప్పటివరకు ఎప్పుడులేని విధంగా కొందరికి 718, 719 మార్కులు రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారితీసింది. పరీక్షల్లో అవకతవకలు జరిగాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అంతేగాక టాపర్స్‌లో కొందరు ఒకే ఎగ్జామ్ సెంటర్‌కు చెందినవారు కావడంతో స్కామ్ జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పరీక్షలో సమయం కోల్పోయినట్లు నివేదించిన కొందరు అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడంవల్ల ఇలా 718, 719 మార్కులు వచ్చాయని ఎన్టీఏ వివరించింది. కానీ ఏ ప్రాతిపదికన, ఎన్ని గ్రేస్ మార్కులు ఇచ్చారో చెప్పలేదు. 2024 మే 5న పరీక్ష నిర్వహణ సందర్భంగా కొన్ని పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు పేపర్లు ఇవ్వడం ఆలస్యం కావడంతో ఆందోళన వ్యక్తం చేశారని, అలాంటి కేసులను ఎన్టీఏ తీసుకుందని ఎన్టీఏ తెలిపింది. అభ్యర్థులు ఎదుర్కొన్న సమయ నష్టానికి పరిహారంగా 2018 జూన్ 13 నాటి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నార్మలైజేషన్ ఫార్ములాను అమలు చేశామని ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. కాగా నీట్ యూజీ 2024 రిజిస్ట్రేషన్లు ఈ ఏడాది 16.85 శాతం పెరిగాయి. గతేడాది 20.59 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఈ ఏడాది 24.06 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్లు పెరగడంతో టాపర్ల సంఖ్య పెరిగిందని, ఈ ఏడాది పేపర్ సులువుగా ఉండటం కూడా టాపర్ల సంఖ్య పెరగడానికి దోహదపడిందని ఎన్టీఏ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నీట్ యూజీ 2024 టాపర్లపై బ్యాక్?గ్రౌండ్? చెక్ కూడా చేశామని, టాపర్లు 10వ తరగతి, 12వ తరగతిలో కూడా ఎక్కువ మార్కులు సాధించారని పేర్కొన్నారు. కాగా ఈ ఏడాది నీట్ పరీక్షకు 20.38 లక్షల మంది విద్యార్థులు హాజరుకాగా.. 11.45 లక్షల మంది అర్హత సాధించారు.

# ఈ లోక్‌సభలో చదువురాని ఎంపీలే లేరు



ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలంతా విద్యావంతులేనని అసోషియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక స్పష్టం చేసింది. ఈ 18వ లోక్‌సభలో ఒక్క చదువురాని ఎంపీ కూడా లేరని తెలిపింది. ఈ ఎన్నికల కోసం మొత్తం 121 మంది నిరక్షరాస్యులు నామినేషన్‌లు దాఖలు చేయగా.. వారిలో ఒక్కరూ కూడా ఎంపీగా విజయం సాధించలేకపోయారని వెల్లడించింది. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. ఈ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది ఎంపీల్లో అత్యధిక మంది ఉన్నత విద్యావంతులే ఉన్నారు. కేవలం ఒక్క ఎంపీ మినహా మిగిలిన అందరూ సంబంధిత ధృవపత్రాలను కలిగి ఉన్నారు. ఆ ఒక్క ఎంపీ దగ్గర మాత్రమే విద్యాసంబంధ ధృవపత్రాలు లేవు. మొత్తం 105 మంది ఎంపీలు, అంటే సుమారుగా 19 శాతం ఎంపీలు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసించి ఉన్నారు. వారిలో కేవలం ఆరుగురు ఎంపీలు మాత్రమే 10వ తరగతి లోపు విద్యను అభ్యసించారు. మరో 34 మంది 10వ తరగతి పాసయ్యారు. ఇంకో 65 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యారు. 98 గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్స్ ఉన్నారు. సుమారు మూడు శాతం మంది డిప్లొమా చేశారు. 147 మంది గ్రాడ్యుయేషన్, మరో 147 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. అదేవిధంగా మొత్తం ఎంపీల్లో 5 శాతం మంది డాక్టరేట్ సాధించిన వాళ్లు ఉన్నారు. ఇక పార్టీల వారీగా చూస్తే.. బీజేపీకి చెందిన 240 మంది ఎంపీల్లో 64 మంది గ్రాడ్యుయేట్‌లు, 49 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 99 మంది ఎంపీల్లో 24 మంది గ్రాడ్యుయేషన్, 27 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు.

# శరద్ పవార్‌తో టచ్‌లో 18 మంది ఎమ్మెల్యేలు

## ఎన్సీపీ అధినేత మనుమడు రోహిన్ పవార్ సంచలన వ్యాఖ్యలు



మహారాష్ట్రలో గత పదేండ్లలో కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ఎమ్మెల్యేలు, పార్టీల నేతలను తమతో చేర్చుకునేందుకు బీజేపీ, శివసేన ఆత్రుత కనబరిచేవి. కానీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని కూటమికి మహారాష్ట్రలో 48 సీట్లకు కేవలం 17 సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత అజిత్ పవార్ సారథ్యంలోని చీలిక వర్గం ఎమ్మెల్యేల్లో అంతర్మథనం మొదలైనట్లు తెలుస్తున్నది. వచ్చే అక్టోబర్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కనుక ఎన్సీపీ- అజిత్ పవార్ వర్గంలో ఉన్న 16-18 మంది ఎమ్మెల్యేలు బయటకు రావాలని యోచిస్తున్నారని, శరద్ పవార్‌తో సంప్రదిస్తున్నారని ఎన్సీపీ (ఎస్సీ) అధినేత శరద్ పవార్ మనుమడు రోహిత్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 48 లోక్ సభా స్థానాల్లో 288 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. లోక్ సభ ఎన్నికల ఫలితాల ప్రకారం శివసేన నేత ఉద్ధవ్ థాక్రే సారథ్యంలోని మహా వికాస్ అఘాదీ (ఎంవీఏ) కూటమి 150 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మహారాష్ట్రలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 144 మంది సభ్యుల మద్దతు ఉంటే చాలు. బీజేపీ ఎంపీలకు బలమైన నియోజకవర్గాల్లోనూ విపక్ష కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో అధికార పక్షం ఎమ్మెల్యేల్లో భయం మొదలైంది. బీజేపీ సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వంలోనే కొనసాగితే తాము తిరిగి గెలుస్తామా? అని బీజేపీ మిత్రపక్షాలుగా ఉన్న ఏక్ నాథ్ షిండే, అజిత్ పవార్ వర్గాల ఎమ్మెల్యేలు మదన పడుతున్నారని సమాచారం. ఎన్సీపీలో 40 మంది ఎమ్మెల్యేలను చీల్చి అజిత్ పవార్.. ఏక్ నాథ్ షిండే సారథ్యంలోని ప్రభుత్వంలోని డిప్యూటీ సీఎంగా చేరారు. లోక్ సభ ఎన్నికల ముందే అజిత్ పవార్‌ను వీడి శరద్ పవార్‌తో చేరారు. తాజా లోక్ సభ ఎన్నికల్లో ఎంపీగానూ ఎన్నికయ్యారు. గురువారం పరిస్థితిని సమీక్షించేందుకు అజిత్ పవార్ ఏర్పాటు చేసిన సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారని సమాచారం. ముందస్తు కార్యక్రమాలు ఉండటం వల్లే అందరూ రాలేకపోయారని ఆ పార్టీ వర్గాల కథనం.

# కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై కాంగ్రెస్ పగటి కలలు




వంద లోక్‌సభ స్థానాలు కూడా దాటని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుపై కలలు కంటోందని పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత అగ్నిమిత్రా పాల్ అన్నారు. రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలతో వేర్వేరుగా సంప్రదింపులు జరుపుతున్నారనే వార్తలపై ఆమె స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం కలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం కొలువుతీరుతుందని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తమకు ఆశించిన స్థానాలు రాలేదని, పార్టీకి వాటిల్లిన నష్టానికి కారణాలపై తాము మేథోమథనం జరుపుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు సంబంధించి తాము గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేయడంలో తాము విజయవంతం కాలేదని తెలిపారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడాలంటే పార్టీలో లోటుపాట్లను చక్కదిద్దడంపై దృష్టి సారించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## నెహ్రూతో మోదీ పోలిక అర్థరహితం




ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాల్లో తనను మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చుకుంటున్నారు కాంగ్రెస్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ చిదంబరం అన్నారు. నెహ్రూతో పోల్చుకునే స్థాయి మోదీకి లేదని స్పష్టం చేశారు. నెహ్రూతో మోదీ తనను పోల్చుకోవడాన్ని తాము తోసిపుచ్చుతున్నామని చెప్పారు. ఈ తరహా పోలికలను దేశ ప్రజలు కూడా తిరస్కరిస్తారని అన్నారు. మోదీ హయాంలో బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా 282, 303, 240 స్థానాలు వచ్చాయని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్‌కు తన హయాంలో వరుసగా 361, 374, 364 సీట్లను సాధించిపెట్టారని గుర్తుచేశారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో విపక్ష ఇండియా కూటమి ఘన విజయం సాధించిందని, తమిళనాడు, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చిదంబరం చెప్పారు.

## మోదీ వెంటే కలిసి నడుస్తాం




**ఢిల్లీ:** ఎన్డీఏ పక్షనేతగా ప్రధాని మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్, మిగతా ఎన్డీఏ పక్ష సభ్యులు మోదీని బలపరిచారు. ఈ సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ... "ఏ సందర్భంలోనైనా మేం మీతోనే(మోదీ) ఉంటాం. ఇండియా కూటమి నేతలు ఈ సారి పొరపాటున గెలిచారు. దేశం కోసం వారేమైనా చేశారా? వారంతా వచ్చే ఎన్నికల్లో ఓడిపోతారు. దేశం ఇకపై బృహత్తర ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్తుంది. మీ నేతృత్వంలో మేమంతా కలిసి పని చేస్తాం. బిహార్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం. ఎన్డీఏ పక్షాలన్ని ఏకతాటిపైకి రావడం సంతోషం. ప్రధానిగా మోదీ ఆదివారం ప్రమాణం చేస్తున్నారు. కానీ ఇవాళ్లే ప్రమాణ స్వీకారం చేయాలని కోరుకుంటున్నా. ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేసినా మీతోనే నడుస్తాం" అని నితీశ్ పేర్కొన్నారు.

**పార్లమెంట్ సెంట్రల్ హాల్లో..**

పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో లోక్ సభ పక్ష నేతగా నరేంద్ర మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, చంద్రబాబు, నితిన్ గడ్కరీ, నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కళ్యాణ్ తదితరులు బలపరిచారు.

## నలుగురు భారతీయ వైద్య విద్యార్థులు మృతి




**మాస్కో :** రష్యా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నలుగురు భారతీయ వైద్య విద్యార్థులు మృతి చెందారు. ఈ మేరకు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని భారతీయ రాయబారి కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. మృతి చెందిన విద్యార్థుల వయస్సు 18-20 ఏళ్ల మధ్య ఉంటుందని వివరించింది. వెలికి నొవ్గొరోడ్ నగరంలోని నొవ్గొరోడ్ స్టేట్ యూనివర్శిటీలో వీరంతా వైద్య విద్యను అభ్యసిస్తున్నారని తెలిపింది. వోలో?వ్ నదిలో కొట్టుకుపోతున్న యువతిని రక్షించేందుకు నలుగురు సహచర విద్యార్థులు ప్రయత్నించారు. ఆ క్రమంలో వారు సైతం నీట మునిగారు. అయితే స్థానికులు వెంటనే స్పందించి.. ఒకరిని స్థానికులు రక్షించారు. అయితే విద్యార్థుల మృతదేహాలను సాధ్యమనంత త్వరలో.. స్వస్థలాలకు పంపుతామని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. అందుకోసం యూనివర్శిటి అధికారులను సంప్రదిస్తున్నామని పేర్కొంది. మరోవైపు... రష్యాలోని నదిలో నీట మునిగి మృతి చెందిన విద్యార్థల స్వస్థలం మహారాష్ట్ర జలగావ్ జిల్లాలోని అమల్నేరు. ఈ ఘటనపై ఇప్పటికే జలగావ్ జిల్లా కలెక్టర్ అయుష్ ప్రసాద్ స్పందించారు. మృతదేహాలను స్వస్థలం తీసుకు వచ్చేందుకు రష్యాలోని భారత రాయబార కార్యాలయంలో సంప్రదిస్తున్నట్లు చెప్పారు.

## అద్వానీ, జోషిల నుంచి ఆశీర్వాదం తీసుకున్న మోదీ



**న్యూఢిల్లీ :** ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా నరేంద్ర మోదీని భాగస్వామ్య పక్షాలు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. అనంతరం మోదీ.. బీజేపీ సీనియర్ నేత, భారతరత్న ఎల్ కె అద్వానీ నివాసానికి వెళ్లారు. ఆయన వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత కేంద్ర మాజీ మంత్రి మురళీ మనోహర్ జోషి నివాసానికి మోదీ వెళ్లారు. అక్కడ ఆయన నుంచి ఆశీర్వాదాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 240 స్థానాలను కైవసం చేసుకుంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీయూ, లోక్ జనశక్తి రామ్ విలాస్ పాశ్వాన్, శివసేన షిండే మద్దతుతో మోదీ ప్రభుత్వాన్ని రెండు మూడు రోజుల్లో కొలువు తీరనుంది. మరోవైపు జూన్ 9వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక శుక్రవారం పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీయే ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తమ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోదీకి ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కీలక సమావేశం అనంతరం నరేంద్ర మోదీ.. పార్టీలోని ఈ సీనియర్ నేతల నివాసాలకు వెళ్లి.. వారి ఆశీర్వాదం అందుకున్నారు.

# నిరూపయోగంగా కాళేశ్వరం ప్రాజెక్టు

-మొదటిపేజీ తరువాయి

ఈ పనులను పర్యవేక్షిస్తుందని అన్నారు. కాళేశ్వరం డ్యామ్ పునరుద్ధరణ సాధ్యమా కాదా అని ఎన్డీఎస్ఏను అడిగామన్నారు. ఆ కమిటీ అధికారులు బ్యారేజ్‌లపై కొన్ని సూచనలు చేశారని తెలిపారు.

మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. వర్షాకాలంలో వరదలు రాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం నీళ్లు స్టోరేజీ చేయొచ్చని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని.. %చీణూూ% కమిటీ మాత్రం అలా చేస్తే ప్రమాదమని చెప్పారన్నారు. బ్యారేజ్ మరమ్మతు పనులు వేగవంతం చేయాలని నవయుగ కంపెనీ ప్రతినిధులను మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. సుందిళ్లలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా గతంలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులను తొలగించామని తెలిపారు. జ్యుడీషియల్ విచారణ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టి నీళ్లలో పోశారని మండిపడ్డారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి కట్టి ఉంటే ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టకు నీళ్లు వచ్చేవని చెప్పుకొచ్చారు. తుమ్మిడిహట్టి ప్రతిపాదనలో ఏడాదికి రూ. వెయ్యి కోట్ల వరకు విద్యుత్ అదనంగా ఖర్చు అయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. 10 వేల కోట్లు ఖర్చు వృథా అయిందని చెప్పారు. కేసీఆర్ ఇన్ని లక్షల కోట్లు నాశనం చేశారని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఫలితాలు చూసిన తర్వాత కేసీఆర్ గురించి మాట్లాడుకోడం వేస్ట్ అని ఎద్దేవా చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీళ్లు వచ్చే ప్రాజెక్ట్ చేపట్టడతామని



ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో గత ప్రభుత్వాలు అబద్ధాలు చెప్పాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బుంగ పడింది వాస్తవమే: ఈ ఎన్సీ అధికారి అనీల్

మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లో బుంగ పడింది వాస్తవమేనని ఈ ఎన్సీ అధికారి అనీల్ తెలిపారు. పీయర్స్ కింద ఇసుక కొట్టుకుపోవడం వల్లే బుంగ పడిందని.. బుంగ ఫిల్లింగ్ చేస్తున్నాయని అనీల్ చెప్పారు.

సుందిళ్ల బ్యారేజ్‌ని సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సుందిళ్ల బ్యారేజ్‌ని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. అధికారులను పలు విషాయలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లలో మరమ్మతు పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. జూన్ చివరికల్లా పనులను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మేడిగడ్డలో ఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చి స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్ ) బృందం బుధ, గురువారాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. నేటి నుంచి జస్టిస్ పీసీ ఘోష్ అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లను పరిశీలించి విచారణ జరుపనున్నారు.

# ఆరు నెలల్లో ఎంత మార్పో!

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితి. 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తర్వాత.. అంటే 20 ఏళ్ల తర్వాత ఇప్పుడా పార్టీ ఫర్ ది ఫస్ట్ టైమ్.. ఆ పార్టీ లోక్‌సభ సీట్ల సంఖ్య జీరోకి పరిమితమైంది. 17 ఎంపీ స్థానాల్లో ఒక్క దాంట్లో కూడా కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది బీఆర్ఎస్. 14 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు మూడో స్థానానికి పరిమితమైయ్యారు. ఖమ్మం, మహబూబాబ్‌లో మాత్రమే రెండో స్థానంలో నిలిచారు. ఇక హైదరాబాద్ స్థానంలో అయితే నాలుగో స్థానానికి పరిమితమైంది ఆ పార్టీ. ఇది మాములు ట్రాక్ రికార్డ్ కాదు. ఇంకా దారుణమైన విషయం ఏంటంటే.. బీఆర్ఎస్‌కు పూర్తిస్థాయిలో పట్టున్న మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా.. ఆ పార్టీ థర్డ్ ప్లేస్‌కే పరిమితమైంది. అంటే ఆ పార్టీ క్యాడర్ దాదాపుగా బీజేపీకి షిఫ్ట్ అయినట్టు కనిపిస్తోంది. నాట్ ఓన్లీ మెదక్.. బీజేపీ గెలిచిన ప్రతి సీటులో కూడా బీఆర్ఎస్ థర్డ్ ప్లేస్‌లోనే ఉంది. ఇది నిజంగా ఆ పార్టీకి డేంజర్ బెల్స్ మోగిస్తుందని అర్థం. ఎందుకంటే ఇప్పటికే చేరాల్సిన వారంతా కాంగ్రెస్‌లో చేరారు. ఇక మిగిలిన వారంతా బీజేపీ వైపు చూస్తున్నట్టు కనిపిస్తోంది. ఇది నిజంగా బీఆర్ఎస్ మనుగడనే ప్రశ్నార్థకంలో పడేసే సిట్యూవేషన్. తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా ఎదిగి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని.. మహారాష్ట్ర, ఏపీలో కూడా పార్టీని విస్తరించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించారు. ఎన్డీఏ, ఇండియా కూటమిలకు ధీటుగా థర్డ్ ఫ్రంట్ వస్తుందని.. తమలాంటి ప్రాంతీయ పార్టీలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషిస్తాయంటూ కేసీఆర్ పదే పదే చెప్పారు. కానీ ఏమైంది.. కేసీఆర్ చెప్పిన మాటలు వట్టి మాటలే అని తేలింది. ఆయన వేసిన వ్యూహాలు పూర్తిగా బెడిసికొట్టాయి. ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించటం పక్కనపెట్టండి. అసలు తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరిచే పరిస్థితి లేనంతగా దిగజారిపోయింది. మరి హీరోగా ఉన్న బీఆర్ఎస్ జీరోగా కావటానికి కారణాలేంటి ? దీనికి ఆన్సర్ అనేకం అని చెప్పవచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణం కాగా.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా బీఆర్ఎస్ పెద్దల్లో తగ్గని అహంకారం. కీలక నేతలంతా పార్టీని వీడటం.. క్షేత్రస్థాయిలో నేతలంగా డీలా పడటం.. కాంగ్రెస్, బీజేపీలు బలమైన పార్టీలుగా ఎదగడం.. ఇలా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఆఖరికి గులాబీ బాస్ కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగినా ప్రజలు కనీసం కూడా పట్టించుకోలేదు. ఇవేకాదు ఇంకా చాలా తప్పులు చేసింది బీఆర్ఎస్ అధిష్టానం. అభ్యర్థుల ఎంపికలో కూడా చాలా తప్పులు జరిగాయి. లాస్ట్ మినిట్‌లో కొత్త అభ్యర్థులను తెరపైకి తేవటం ఆ పార్టీని కొంప ముంచింది. వారికి క్షేత్రస్థాయిలో ఎలాంటి పట్టు లేదు. పార్టీ సింబల్ చూసి ఓట్లు వేసే పరిస్థితి ఎలాగైనా లేదు. ఇప్పుడు ఆ అభ్యర్థుల వ్యక్తిగత చరిష్మా కూడా ఉపయోగపడలేదు. ఇక కేడర్‌ను కాపాడుకోవడలో బీఆర్ఎస్ ఫెయిల్ అయ్యింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర, కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు వచ్చినప్పుడు రోడ్‌షోలు నిర్వహించడం మినహా.. నియోజకవర్గ స్థాయి నాయకులు, పార్టీ ఎమ్మెల్యేలు పెద్దగా కష్టపడట్టు కనిపించలేదుఅసలు జనాల్లో బీఆర్ఎస్‌పై వచ్చిన ఆగ్రహం ఇంకా తగ్గలేదు. పార్టీ పెద్దలకు అంటుకున్న అవినీతి మరకలు ఇంకా మరిచిపోలేదు. చుట్టుకుంటున్న కేసులు.. మేడిపండు మేడిగడ్డ.. ఫోన్ ట్యాపింగ్ అరాచకాలు.. ఇలా ప్రజలకు అన్ని గుర్తున్నాయి. దానికి తగ్గట్టే తీర్పు ఇచ్చారు. ఇప్పటికే షెడ్డుకు చేరిన కారును పొరపాటున కూడా మళ్లీ రోడ్డెక్కే పరిస్థితి రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మరో దారుణమైన పరిస్థితి ఏంటంటే.. బీఆర్ఎస్‌లో పేరుకు లీడర్లు కనిపిస్తున్నా.. క్యాడర్ మొత్తం కకావికలమవుతోంది. సో.. ఇక ముందు రాబోయే ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితులు రిపీట్ అయ్యే చాన్సెస్ కనిపిస్తున్నాయి. అందుకే ఇప్పటికైనా ఆ పార్టీ పెద్దలు.. ప్రజలను తప్పుదోవపట్టిస్తూ.. ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని మానుకొని.. పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి పెడితే బాగుంటుందన్న సలహాలు పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నాయి. మరి బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికైనా మేలుకుంటారా? లేదా? చూడాలి.


# అలా కవర్ చేసిన సీఎం రేవంత్

**ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కష్టపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**కొంత మందికి రూ.500లకే గ్యాస్..**

**కొందరికి గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్**

**ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేస్తున్నామని లోక్‌సభ ఎన్నికల ముందు సీఎం రేవంత్ ప్రకటన**



**హైదరాబాద్ :** తెలంగాణలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కష్టపడుతున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం? కొంత మందికి రూ.500లకే గ్యాస్.. కొందరికి గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేస్తున్నామని లోక్‌సభ ఎన్నికల ముందు సీఎం రేవంత్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే హామీలు నెరవేర్చామని ప్రకటించారు. హామీలు అమలు చేస్తున్నామని, తమది ప్రజాపాలన అని, తమ పాలనకు తెలంగాణ సమాజా మద్దతు ఇస్తోందిన లోక్‌సభ ఎన్నికల సమయంలో సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్ ప్రకటించారు. తెలంగాణలో కచ్చితంగా డబుల్ డిజిట్.. 14కు తక్కువ కాకుండా లోక్‌సభ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండం అని ప్రకటించారు. తెలంగాణ కాంగ్రెస్ చీఫ్‌గా, సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి.. లోక్‌సభ ఎన్నికల బాధ్యతను కూడా భుజానికి ఎత్తుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లో మ్యాజిక్ చేస్తామనే ధీమాతో దూకుడుగా వ్యవహరించారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, పదేళ్ల బీజేపీ పాలనపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని భావించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ నుంచి 14 స్థానాల్లో గెలుస్తామని ప్రకటించారు. ఈమేరకు తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను.. 12 స్థానాల్లో ఎన్నికల ప్రచారంలో స్వయంగా పాల్గొన్నారు. సభలకు వచ్చిన జనం చూసి సీఎం రేవంత్‌రెడ్డిలో నమ్మకం మరింత పెరిగింది. ఎన్నికల్లో కచ్చితంగా డబుల్ డిజిట్ స్థానాలు గెలుస్తామని ధీమాతో ఉన్న రేవంత్‌కు పోలింగ్ ముగిసిన తర్వాత వాస్తవ పరిస్థితి అర్థమైంది. డబుల్ డిజిట్ నుంచి 9 స్థానాలకు దిగివచ్చారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం అయ్యామని ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫలితాలు వచ్చాయి. 9 సీట్లు అనుకుంటే.. ఒకస్థానం తగ్గి 8కి పరిమితం కావాల్సి వచ్చింది. మరోవైపు బీజేపీ కూడా అధికార కాంగ్రెస్‌తో సమానంగా సీట్లు గెలిచింది. దీంతో రేవంత్ ఛాలెంజ్‌లో ఫెయిల్ అయ్యార్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిని బీజేపీ తమకు అనుకూలంగా మార్చుకుంటోందిలోక్‌సభ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండమ్ అని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఫలితాల తర్వాత దానిని కవర్ చేసుకునే పని మొదలు పెట్టారు. సీట్లు తగ్గినందున.. రెఫరెండంపై వెనక్కి పోతే? ముందు ముందు మరిన్ని ఇబ్బందులు తప్పవని గుర్తించి.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న రాగం అందుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ చేతులు ఎత్తేసిందని, బీఆర్ఎస్ ఓట్లు కూడా బీజేపీకి వేయాలని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సూచించారని అంటున్నారు. ఈమేరకు ప్రెస్‌మీట్ పెట్టి మరీ వెల్లడించారు. కమ్మక్కు రాజకీయాలతోనే తమకు సీట్లు తగ్గాయని పేర్కొన్నారు. దీంతో రెఫరెండంలో ఫెయిల్ అయిన రేవంత్.. దానిని కవర్ చేసుకునేందుకు బీజే పీ, బీఆర్ఎస్ ఒక్కటే అని మాట్లాడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. రేవంత్‌కు దమ్ముంటే.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేయాలని సవాల్ చేస్తున్నారు. అలా చేయకుంటే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు అయినట్లే అని పేర్కొంటున్నారు. తమ కుమ్మకు, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## రేవంత్ పాలన ఎలా చేయాలో నేర్చుకోవాలి : మోత్కుపల్లి నర్సింహులు

**హైదరాబాద్ :** తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.. ఉంటాను అని సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. దళితుడిగా ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. రేవంత్ ముఖ్యమంత్రి అవుతాడని చెప్పింది తానే. కానీ మొదటగా సీఎం మమ్మల్నే రోడ్డున పడేశారు. మాదిగలకు ఒక్కంటే ఒక్క ఎంపీ సీటు ఇవ్వలేదు. ఆరు గంటల పాటు సచివాలయంలో కూర్చున్న సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఇన్నేండ్ల తన రాజకీయ జీవితంలో ఇంత అవమానం ఎక్కడ జరగలేదు. జగన్ అహంకారం వల్ల ఈ రోజు ఈ పరిస్థితి తెచ్చుకున్నాడు. ఎన్నికల హామీలను ఎందుకు ఇంకా నెరవేర్చలేదు. పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ దూరం అవుతుంది. చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాడు. రేవంత్ పాలన ఎలా చేయాలో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు.

## మోదీ టీంలో చేరిది ఎవరో?

**హైదరాబాద్ :** ప్రధాని నరేంద్రమోదీ తన మంత్రి వర్గంపై ఫోకస్ పెట్టారు. ఏ రాష్ట్రానికి ఎన్నేసి పదవులు ఇవ్వాలన్న దానిపై చర్చిస్తున్నారు. అన్నింటికంటే ముందుగా తెలంగాణ విషయాని కొద్దాం. మెజార్టీ తగ్గిన నేపథ్యంలో ఈసారి తెలంగాణకు ఛాన్స్ ఇవ్వాలని భావిస్తోంది తెలంగాణ నుంచి ఇద్దరిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవాలని భావిస్తున్నారట ప్రధాని నరేంద్రమోదీ. వారికి సహాయ మంత్రులు ఇవ్వాలని ప్లాన్ చేసినట్టు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రేసులో మాజీ మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ లాంటి నేతలు పోటీ పడుతున్నారు. వీళ్లలో ఇద్దరికి మాత్రమే ఛాన్స్ ఇవ్వనున్నట్లు ఢిల్లీ నుంచి సంకేతాలు వెలువడుతున్నాయి. ఈసారి బండి సంజయ్‌కి ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నారట బీజేపీ హైకమాండ్. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు బండి సంజయ్‌ని తప్పించి అధ్యక్ష పదవి బాధ్యతలను కిషన్‌రెడ్డికి అప్పగించారు. ఆ సమయంలో బండి సంజయ్‌కి ప్రధాని నుంచి స్పష్టమైన హామీ వచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయనకు ఛాన్స్ ఉంటుందని అంటున్నారు. ఇకపోతే మరొకరు ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. అందులో కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటెల రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మరి నరేంద్రమోదీ– అమిత్ షాలు ఎవరి వైపు మొగ్గు చూపుతారో చూడాలి. ఏపీకి ఐదారు డిమాండ్ చేస్తున్నట్లు నేపథ్యంలో కనీసం తెలంగాణకు రెండైనా కేటాయిస్తే బాగుంటుందని కమలనాథుల ఆలోచనగా చెబుతున్నారు. కేబినెట్ మంత్రులపై శుక్రవారం సాయంత్రం నాటికి ఓ కొలిక్కి రావచ్చని అంటున్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో కల్తీ మద్యం ప్రవేశపెట్టొద్దు.. రేవంత్ రెడ్డికి క్రిశాంక్ బహిరంగ లేఖ



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కల్తీ మద్యం ప్రవేశపెట్టొద్దని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని క్రిశాంక్ పేర్కొన్నారు. ఈ మేరకు బహిరంగ లేఖ విడుదల చేశారు. 21 మే 2024 మంత్రి జూపల్లి కృష్ణారావు ఎలాంటి మద్యం కంపెనీలు తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా వ్యాపారం చేయడానికి ప్రతిపాదనలు పెట్టలేదని చెప్పి ఎవరన్నా అలాంటి వార్తలు రాస్తే రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేస్తారని హెచ్చరించారు. బీఆర్ఎస్ 27 మే 2024న మంత్రి జూపల్లి కృష్ణారావు అబద్ధాన్ని బహిర్గతం చేస్తూ సోం డిస్టలరీస్ అనే సంస్థకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంపై మీడియా సమావేశం పెట్టిన అనంతరం జూపల్లి కృష్ణారావు నిజాన్ని ఒప్పుకొని సోమ్ డిస్టిలరీస్‌కు అనుమతులు ఇవ్వడం వాస్తవమే. కానీ దానిపై మంత్రికి ఎలాంటి సమాచారం లేదు. అది బేవరేజస్ కార్పొరేషన్ యొక్క సొంత నిర్ణయం అని బాధ్యతరహితంగా పత్రికా ప్రకటన ద్వారా ప్రకటించారు. సోమ్ డిస్టిలరీస్ సంస్థ రాష్ట్ర ఖజానాకు గండికొడుతూ, ప్రభుత్వ సంస్థల వద్ద రుణాలను తీసుకొని ఎగ్గొడుతూ, కల్తీ మద్యం వ్యాపారం చేయడంలో ప్రఖ్యాతిగాంచింది. మీకు ఈ బహిరంగ లేఖలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వారి కల్తీ బీరును ధ్వంసం చేసే చిత్రాన్ని కూడా జతపరిచినాము. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలాంటి కల్తీ మద్యం లేకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడారు. దయచేసి కమిషన్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నకిలీ బీరును తయారు చేసే కంపెనీలకు అనుమతులు ఇచ్చి ఆరోగ్యానికి హానికరమైన కల్తీ మద్యాన్ని రాష్ట్రంలో అందుబాటులోకి తేవ వద్దని బీఆర్ఎస్ పార్టీ యొక్క మనవి. మా విజ్ఞప్తిని స్వీకరించి సోం డిస్టలరీస్‌కు ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేస్తూ వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడుతారని భావిస్తున్నాం అని క్రిశాంక్ తన లేఖలో పేర్కొన్నారు.

## పాలనపై ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇక నుండి రోజు సచివాలయానికి రాన్నున్నారు. గత రెండు నెలలుగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో సచివాలయానికి దూరంగా ఉన్నారు సీఎం రేవంత్. మార్చి 16 నుండి జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో సీఎం పరిపాలనాపరమైన అంశాలకు దూరంగా ఉన్నారు. సమీక్షలు, సమావేశాలు నిర్వహించడానికి, అధికారులను కలవడానికి అనుమతి లేకపోవడంతో సీఎం తన నివాసం జూబ్లీహిల్స్ నుండే కార్యక్రమాలు నిర్వహించారు. ఇక పార్లమెంట్ ఎన్నికల ప్రచారాలను కూడ అక్కడి నుండే నిర్వహించారు సీఎం రేవంత్. అత్యవసర సమావేశాలు, సమీక్షలు ఉంటే కూడా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు తప్ప అదేశించడానికి వీలు లేకుండా పోయింది.

**అత్యవసర సమీక్షల కోసం సచివాలయానికి..**

సచివాలయానికి వచ్చిన తరువాత కొన్ని అత్యవసరాలకు సంబంధించిన అంశాలపై సీఎం సమీక్షించనున్నారు. ధాన్యం కొనుగోలుతో పాటుగా, విత్తనాల కొరత, వర్షాలు, వరదలకు సంబంధించిన వాటిపై అధికారులతో సమీక్షించారు. దీనితో పాటు పలు ముఖ్యశాఖలపై కూడా అధికారులతో చర్చలు జరిపారు. అప్పుడు కోడ్ అందుబాటులో ఉండటంతో పూర్తి స్థాయిలో సమీక్షించడానికి నిబంధనలు అడ్డువచ్చాయి.

**కోడ్‌లోనే కేబినేట్ సమావేశానికి నిర్ణయం..**

ఇక కోడ్ కొనసాగుతుండగానే కేబినేట్ సమావేశం నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. కానీ అందుకు ఎన్నికల సంఘం ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. కేబినేట్ సమావేశం కోసం నిర్ణయించిన మే 18 రోజున ఈసీ నుండి సమాధానం రాలేదు. దీంతో సమావేశం కోసం రాత్రి వరకు మంత్రులు, అధికారులు వేచి చూసారు. దీంతో సీఎం కేబినేట్ పర్మిషన్ రాకపోవడంతో వాయిదా వేశారు. మళ్లి ఈసి పర్మిషన్ రావడంతోనే మే 21 న నిర్వహించుకున్నారు. ఆ సమావేశంలో తెలంగాణ అవతరణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాని కోసం ఈసీ అనుమతి కోరి ఉత్సవాలను నిర్వహించారు.

**నేటి నుండి సచివాలయానికి సీఎం..**

ఇక కోడ్ ముగిసిన నేఫథ్యంలో జూన్ 7 నుంచి యధావిధిగా సచివాలయంలో విధులకు హజరుకావాలని నిర్ణయించుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. రేపటి నుండి పెండింగ్‌లో ఉన్న అంశాలపై దృష్టి సారించాలని భావిస్తున్నారు.

# తెదేపా ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

## - పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం

**వాస్తవ నేస్తం,బోనకల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసుకొని అధికారంలోకి వచ్చిన సందర్భంగా గురువారం బోనకల్ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి రావినూతల బోనకల్ గ్రామాలలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు, పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, జిల్లా ఉపాధ్యక్షులు మల్లాది హనుమంతరావు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. బోనకల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు,టిడిపి మాజీ మండల అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి అనంతరామయ్య విగ్రహం కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని సినిమా హాల్ సెంటర్ వద్ద బారి కేక్ కట్ చేసి నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసిరెడ్డి రామనాధం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన సైకో పీడ వదిలి సైకిల్ పాలన వచ్చిందని, గత ఐదేళ్లలో ప్రజలు అన్ని విధాలుగా పలు ఇబ్బందులకు గురయ్యారని, విజనరీ లీడర్ చంద్రబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. తెలంగాణలో కూడా పార్టీ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రణాళికలను తీసుకొస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, తెదేపా నాయకులు నందమూరి సత్యనారాయణ, సాదినేని హనుమంతరావు, తుళ్లూరు కొండలు రావు,పాపినేని వెంకటయ్య, కళ్యాణపు వెంకటేశ్వరరావు, మామిళ్ళ నరసింహారావు, మామిళ్ళ కొండలరావు గంగుల శ్రీనివాసరావు, బండి రామారావు సంద్ర ప్రసాద్, మందా నరేందర్ మండేపూడి గోర్కే,కరివేద పిచ్చయ్య,సాధినేని కొండలరావు, చావా హనుమంతరావు, గుడిమళ్ల శ్రీను,గుడిమళ్ల గోపి యనమద్ది ఆదయ్య, రావూరి మంగయ్య, ఏసుపోగు నాగేశ్వరరావు వట్టికొండ నవీన్, బండి శీను, కంచేటి వెంకటేశ్వర్లు కంచర చిన్నప్ప బీజేపీ నాయకులు వీరప్పనేని అప్పారావు, గుగులోతు నాగేశ్వరరావు, గంగుల నాగయ్య బోయినపల్లి గోపాలు,జనసేన నాయకులు గుగులోతు దుర్గ ప్రసాద్, బాదావత్ తరుణ్ బాధావత్ కళ్యాణ్



గుగులోత్ సాయి బాధావత్ సూర్య వరి కళ్ళ వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంద అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నా ప్రైవేటు పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి

**జిల్లా విద్యా అధికారి యాదయ్య గారికి ఫిర్యాదు చేసిన ఎభివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ కుమార్.**

**నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి**

**పాఠ్యపుస్తకాలు అముతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

**ప్రైవేటు పాఠశాలల దోపిడీని అడుకుంటాం**

**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** నూతనంగా విద్య సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా వివిధ ప్రైవేటు పాఠశాలల యాజాన్యాలు విద్యార్థులను, వారి తల్లి తండ్రులను నిలువు దోపిడి చేస్తున్నారు. అలాంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. విద్యా సంవత్సరం ప్రారంభం అవకముందే అడ్మిషన్ ఫీస్ పేరుతో వేలకి వేలు వసూలు చేస్తున్న ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి మరియు జిల్లా వ్యాప్తంగా సరైన అనుమతులు మరియు సరైన భవనాలు కూడా లేకుండా నడుస్తున్నా ప్రైవేటు పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి యాదయ్య గారికి ఎభివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ కుమార్ ఫిర్యాదు చేశారు.



# గ్రూప్-1 పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు

**జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లలో పరీక్ష రాయనున్న 6,729 మంది అభ్యర్థులు**

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు.**

**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ %-×% ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున్న అన్నిరకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లలో మొత్తం 6729 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పట్టణ ప్రధాన రోడ్డులు, చౌరాస్తాలలో సూచిన బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్



అమలులో ఉంటుదని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు లాంటివి నిర్వహించ కూడదని, అనవసరంగా గుంపులు గుంపులుగా ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపు యజమానులకు సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించవలసిందిగా సూచించారు. పరీక్ష ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోనికి అనుమతి ఇస్తారని, 10 గంటలకు పరీక్షా కేంద్రం గెట్ మూసివేయడం జరుగుతుందని అన్నారు. 10 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన ఎవ్వరిని లోపలికి అనుమతించడం జరగదన్నారు.

## విద్యుత్ ఘాతంతో మేక మృతి

**వాస్తవ నేస్తం ఇచ్చోడ:** మండలంలోని గేర్జం గ్రామంలో శుక్రవారం గద్దె భూమన్న అనే నిరుపేద రైతుకు చెందిన మేక విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. నిరుపేద అయిన తనను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



## పోడు రైతులకు అటవీ అధికారులు ఇబ్బంది పెట్టవద్దు

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అదికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. శు క్రవారం ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం, బాజీపేట్, గుండాల, సిరిచెల్మ గ్రామాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఇట్టి విషయాన్ని తెలుసుకుని బోథ్ అసెంబ్లీ ఇంచార్జీ ఆడే గజేందర్ తో కలిసి ఆమె వ్యవసాయ భూములను పరిశీలించారు. పోడు వ్యవసాయం చేసుకుం టున్న రైతుల భూముల్లో కందకాలు తవ్వటాన్ని ఆపాలని అటవీ అధికారులకు సూచించారు. ఏ సమస్య ఉన్న గ్రామ ప్రజల సమక్షంలో కమిటీలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించా లాన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తుందని, ప్రజలకు అనుకూలంగా



అధికారులు,నాయకులు సహకరించాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా అడవిని పోడు చేసుకుని సాగు చేసుకుంటున్న రైతులకు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి, పిఎంపీల చికిత్స కేంద్రాలపై దాడులను నిలిపివేయాలి

**పేదలకు సత్వర వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలపై కక్ష తగదు**

**వైద్య వృత్తిని నమ్ముకొని బతుకుతున్న ఆర్ఎంపి.**

**ప్రభుత్వ నిబంధన లకు అనుగుణంగా వైద్యం చేస్తున్నాం**

**ఆర్ఎంపీల సంఘం బోనకల్ మండల అధ్యక్షులు యంగల గౌతం**

**వాస్తవ నేస్తం,బోనకల్:** ఆర్ఎంపి పిఎంపీలపై రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఎన్ఎం సీ అధికారుల దాడులను ప్రభుత్వం నిలిపివేయాలని ఆ సంఘం బొనకల్ మండల అధ్యక్షులు, యంగల గౌతం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ఎంపి, పిఎంపీల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.. పేదలకు ప్రథమ చికిత్స అందించి ప్రాణాల కాపాడుతున్న వైద్యులపై దాడులు చేయటం సరికాదన్నారు. తమ సంఘం ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటుందన్నారు. దాడులు చేసి వైద్యశాలలు మూసివేయడంతో ఆర్ఎంపి, పిఎంపీలు పూట గడవని స్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే వైద్యం నిర్వహిస్తామని దాడులు నిలిపివేయాలని ఆయన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి,కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి బాలస్వామి,(బాలు) తదితరులు పాల్గొన్నారు.

## వోక్సన్ యూనివర్సిటీలో చనిపోయిన కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

**అఖిలపక్షం నాయకులతో యాజమాన్యం చర్చలు**

**మృతుని కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించిన యాజమాన్యం**




**వాస్తవ నేస్తం, సంగారెడ్డి:** మునిపల్లి మండలం కంకోల్ గ్రామపంచాయతీ పరిధిలోని వోక్సన్ యూనివర్సిటీలో కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్ కార్మికుడు గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. యూనివర్సిటీలో అనుమానాస్పదంగా మృతి చెందడంతో గత మూడు రోజులుగా యూనివర్సిటీ ముందు గ్రామస్తులు అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మృతుడు శవం గంగకత్వ వాగులో దొరకడంతోయూనివర్సిటీ ముందు అఖిలపక్షం నాయకులు కంకోల్, సైదాపూర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం దిగివచ్చి చర్చలు జరుపగా మృతుని కుటుంబానికి 22 లక్షల 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వడానికి రాతపూర్వకంగా అంగీకరించింది. అంత్యక్రియల కోసం లక్ష రూపాయలు నగదును యూనివర్సిటీ యాజమాన్యం అందజేసింది. డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, సిపిఎం మునిపల్లి మండల నాయకులు రమేష్ గౌడ్, కాంగ్రెస్ మండల నాయకులు సతీష్, శ్రీశైలం, వీరన్నపాటేల్, చాంద్ పాషా, ఆసాద్ పాటేల్, సైదాపూర్ గ్రామ పెద్దలు టిఆర్ఎస్ నాయకులు మల్లగౌడా తదితరులు, పాల్గొన్నారు.

## పిప్పిరి లో ప్రారంభమైన 'బడి బాట'




**వాస్తవ నేస్తం,బజార్హత్నూర్:** మండలంలోని పిప్పిరి గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కరపత్రాలు పంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మొదటి రోజు ఎనిమిది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గంగాధర్ మాట్లాడుతూ.. మన ఊరు - మన బడి ద్వార పాఠశాలలో వచ్చిన మార్పు ఆహ్లాదకర వాతావరణం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారనే మంచి విద్యా అందుతుందన్నారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్ ఉపాధ్యాయుడు దేవర్ల సంతోష్, హై స్కూల్ ఉపాధ్యాయులు వినయ్ కుమార్, తులసిరామ్.అంగన్వాడీ కార్యకర్తలు సుగుణ మరియు గంగోలి పాల్గొన్నారు.

## రిమ్స్ డైరెక్టర్‌ను సన్మానించిన అమన్ ఫౌండేషన్ సభ్యులు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** రైమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్ కు గ్రీన్ ఛాంపియన్ అవార్డు వచ్చిన సందర్భంగా అమౌంట్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్బాత్ ఖాన్, ఉపాధ్యక్షుడు పరమేశ్వర్ లు డైరెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆసుపత్రిలో బయో కెమికల్ వేస్టేజ్ పైన అవగాహన కల్పించినందుకు గాను జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఈ అవార్డు రావడం జిల్లాకే గర్వకారణం అన్నారు. రైమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్ సేవలను కొనియాడారు.




Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com